సాక్షి
నాగర్‌కర్నూల్
ఆదివారం । 28 । మే । 2023



రియల్ మాయ
కొందరు రియల్ వ్యాపారులు కుంటలు, చెరువులను వెంచర్లుగా మారుస్తున్నారు.

వివరాలు 8లో ▸



ఊటకుంటల పరిశీలన
అమృత్ సరోవరంలో భాగంగా నిర్మించిన చెరువులను సీఆర్‌డీ బృందం పరిశీలించింది.

వివరాలు 8లో ▸

వాతావరణం
గరిష్టం/కనిష్టం
39.4 /27.2

ఉదయం నుంచి ఎండ తీవ్రత ఉంటుంది. అప్పుడప్పుడు ఆకాశం మేఘావృతమై తేలిక పాటి వర్షం పడే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

8 వరకు 'దోస్త్' రిజిస్ట్రేషన్ చేసుకోవాలి
కందనూలు: డిగ్రీలో ప్రవేశాల కోసం వచ్చేనెల 8వ తేదీలోగా మొదటి విడత దోస్త్ ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ చేసుకోవాలని ప్రభుత్వ డిగ్రీ కళాశాల (ఆర్ట్స్) ప్రిన్సిపాల్ మధుసూదన్ శర్మ ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అనేక సదుపాయాలు ఉన్నాయని, ఇంగ్లిష్, తెలుగు మీడియంలో అన్ని సబ్జెక్టులు బోధించడానికి అనుభవం కలిగిన ఫ్యాకల్టీ ఉన్నారన్నారు. విద్యార్థులు తమ ఉత్తమ భవిష్యత్తు కోసం దోస్త్ ద్వారా ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్‌లో తమ కళాశాలను ఎంచుకోవచ్చని, లేకుంటే నేరుగా సంబంధిత ధ్రువీకరణ పత్రాలు జిరాక్స్ తీసుకొని, ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ ఫీజుతో వస్తే కళాశాలలోనే ఆన్‌లైన్ చేపిస్తామని పేర్కొన్నారు. వివరాలకు సెల్ నం.9440842201, 9505480828 ఫోన్ చేసి తెలుసుకోవచ్చని తెలిపారు.

రాష్ట్రస్థాయి పోటీలకు తరలిన క్రీడాకారులు



కందనూలు: సీఎం కప్‌లో భాగంగా మండల, జిల్లా స్థాయిలో వివిధ పోటీల్లో పాల్గొని ప్రతిభ కనబర్చిన క్రీడాకారులు రాష్ట్ర స్థాయిలో పాల్గొనేందుకు తరలివెళ్లారు. ఈమేరకు శనివారం శనివారం జిల్లా కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడా మైదానం నుంచి రాష్ట్ర స్థాయి సీఎం కప్ పోటీల్లో పాల్గొనడానికి జిల్లాకు చెందిన 21జట్లు.. 143 మంది క్రీడాకారులు రెండు బస్సుల్లో హైదరాబాద్‌కు తరలివెళ్లారు. ఈ సందర్భంగా డీఈఓ గోవిందరాజులు, డీవైఎస్‌ఓ నటరాజు జెండా ఊపి బస్సులను ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ చదువుతో పాటు క్రీడల్లో కూడా రాణించాలని, హైదరాబాదులో నిర్వహించే సీఎం కప్ రాష్ట్రస్థాయి పోటీల్లో జిల్లా క్రీడాకారులు సత్తా చాటి మంచి పేరు తీసుకురావాలన్నారు. మూడు రోజుల పాటు ఈ పోటీలు జరుగుతాయని తెలిపారు. పాండు, ప్రసాద్ గౌడ్, సీతారాంనాయక్, శేఖర్ బాబు, సుభాషిణి పాల్గొన్నారు.

భవిష్యత్ చిరుధాన్యాలదే..
బిజినేపల్లి: మారుతున్న వాతావరణ పరిస్థితుల కారణంగా భవిష్యత్తులో చిరుధాన్యాలే కీలక పాత్ర పోషించనున్నాయని ఇన్‌చార్జ్ ఏడీఆర్ భరత్‌భూషణ్ అన్నారు. మే 27 ప్రపంచ వాతావరణ దినోత్సవం సందర్భంగా వ్యవసాయ పాలిటెక్నిక్ విద్యార్థులకు అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఇంచార్జీ ఏడీఆర్ భరత్‌భూషణ్ మాట్లాడుతూ వాతావరణ మార్పులకు అనుగుణంగా వ్యవసాయంలో మార్పులు వస్తాయని, చేపట్టాల్సిన చర్యలను, చిరుధాన్యాల సాగుద్వారా కలిగే ప్రయోజనాలను వివరించారు.

సర్వే.. సాగదీత

- నెలకు 200పైగా కొత్త దరఖాస్తులు
- జిల్లాలో ఇప్పటికే 1,800పైగా పెండింగ్
- డిజిటల్ వైపు మొగ్గు చూపుతున్న రైతాంగం
- రూ.లక్షల్లో ఆదాయం కోల్పోతున్న ప్రభుత్వం

అధిక ధరలతో విపరీతంగా పెరిగిన డిమాండ్



కల్వకుర్తి శివారులో డీజీపీఎస్‌తో భూ సర్వే చేస్తున్న లైసెన్స్ సర్వేయర్లు (ఫైల్)

కల్వకుర్తి: ఎన్నో ఏళ్ల నుంచి **భూమి సర్వే అనేది** సాధారణ విషయం. కానీ, **ఇప్పుడు అది అసాధారణ** సమస్యగా మా**రిపోయింది. భూముల** ధరలు పెరగడం, రియ**ల్ ఎస్టేట్‌తో** క్రయవిక్రయాలు అధికమవడంతో **పంచాయితీలు నెలకొని..** హద్దుల ఏర్పాటుకు అవ**సరం ఏర్పడింది. దీంతో** సర్వేకు అమాంతం డిమా**ండ్ పెరిగింది. భూ సర్వే** చేయాలని అధికంగా దరఖాస్తులు వస్తున్నాయి. అయితే డిమాండ్‌కు తగ్గట్టుగా సర్వేలో వేగం పెరగడం లేదు. దరఖాస్తు చేసిన 45 రోజుల్లో సర్వే చేయాలని నిబంధన ఉన్నా అది ఎక్కడా అమలు కావడం లేదు. ఫలితంగా సకాలంలో సర్వే చేయక పోవడం, భాగాలుగా విభజించకపోవడంతో రైతులు ప్రైవేట్ సర్వేల వైపు మొగ్గుచూపుతున్నారు. ఈ క్రమంలోనే డిజిటల్ సర్వేల కోసం ఆసక్తి పెరిగింది. గొలుసుతో ఆలస్యం కావడంతోపాటు చెట్లు, పొదలు ఉంటే పనులు ఆలస్యంతోపాటు సరిగా ఉండదనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. డిజిటల్ సర్వేతో వేగంగా పని జరగడం, నిక్కచ్చిగా ఫలితం వస్తుండటంతో రైతులు ఆసక్తి చూపుతున్నారు. ప్రభుత్వం మాత్రం వందేళ్ల నాటి గొలుసు కొలతలపైనే ఆధారపడటంతోపాటు.. వాటిలోనూ జాప్యం చేస్తుండటంతో విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

జిల్లాలో 13 మండలాలకే..

జిల్లాలో మొత్తం 20 మండలాలకు గాను 13 మంది రెగ్యులర్ సర్వేయర్లు ఉన్నారు. మిగతా మండలాల్లో మూడు చోట్ల ఐకేపీ సర్వేయర్లు ఉండగా, మరో మూడు మండలాల్లో లైసెన్స్ సర్వేయర్లు పనిచేస్తున్నారు. జిల్లాకేంద్రంలో ఒక ఏడీ అధికారి ఉండగా.. నాలుగు డివిజన్లకు గాను కల్వకుర్తి, నాగర్‌కర్నూల్‌కు మాత్రమే సర్వేయర్లు ఉన్నారు. వీరే అచ్చంపేట, కొల్లాపూర్ డివిజన్లకు ఇన్‌చార్జ్‌గా పనిచేస్తున్నారు. ఇక తిమ్మాజిపేట, బిజినేపల్లి, పెంట్లవెల్లి మండలాల్లో లైసెన్స్ సర్వేయర్లు పనిచేస్తుండగా.. బల్మూరు, లింగాల, కోడేరు మండలాల్లో ఐకేపీ సర్వేయర్లు ఉన్నారు. పదర మండలంలో పోస్టు ఖాళీగా ఉంది.

జిల్లాలో దరఖాస్తులు ఇలా..
ఎవరైనా భూమి సర్వే చేసుకోవాలంటే సర్వే నంబర్‌కు రూ.295తో బ్యాంకులో గాని, మీసేవలో గాని చలాన్ తీయాలి. మూడు సర్వే నంబర్ల వరకు ఒక చలాన్ సరిపోతుంది. మూడు దాటితే మరో చలాన్ తీయాల్సి ఉంటుంది. పాస్ పుస్తకం, కొత్త పహాణిలతో మీసేవలో సంప్రదిస్తే దరఖాస్తు చేస్తారు. ఈ దరఖాస్తు తహసీల్దార్ కార్యాలయానికి చేరగా.. అక్కడి నుంచి సర్వేయర్లకు పంపిస్తారు. వారు 45 రోజుల్లో ఎప్పుడైనా సర్వేకు రావచ్చు. సర్వేకు వచ్చే ముందు చుట్టపక్కల రైతుల వివరాలు తెలుసుకొని వారికి నోటీసులు జారీ చేస్తారు. మండల అధికారి వచ్చి సర్వే చేసి పంచనామా అందజేస్తారు. రైతుకు నచ్చకపోతే ఆర్డీఓ పరిధిలోని డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ సర్వేకు దరఖాస్తు చేయవచ్చు. అక్కడ సర్వే ఫలితం సక్రమంగా లేకపోయినా జిల్లా సర్వేయర్ (ఏడీ)కి అప్పీలు చేసుకోవచ్చు. డివిజనల్ సర్వే కోసం మూడు సర్వే నంబర్ల వరకు రూ.1,410 బ్యాంకులో చలాన్ తీయాలి. జిల్లా అసిస్టెంట్ డైరెక్టర్ సర్వే కోసం జిల్లా కేంద్రంలోనే రూ.1,410 చలాన్ తీసి దరఖాస్తు చేసుకోవాలి.

వందేళ్ల క్రితం విధానంలో..
ప్రభుత్వ సర్వేయర్లు నేటికి వందేళ్ల క్రితం ఉన్న గొలుసులపైనే ఆధారపడుతున్నారు. ఆయా గ్రామాల్లోని సర్వే నంబర్‌కు ఒక టిపన్ ఉంటుంది. చాలా ఏళ్ల కిందట ఇవి తయారు చేయడంతో కాగితం దెబ్బతిన్న చాలా టిపన్లు పాడైపోయాయి. బాగున్న మంచి పేపర్లను స్కాన్ చేశారు. టిపన్ లేని చోట గ్రామ నక్ష ప్రకారం సర్వే చేస్తున్నారు. పూర్వం సర్వే చేసిన పొలంలో నంబర్ల హద్దులు నిర్ణయించిన సమయంలో రాళ్లు పాతారు. కొన్నిచోట్ల యంత్రాలతో దుక్కులు దున్నడం, పొదలు తొలిగించడంతో రాళ్లు పోయాయి. కొందరు రైతులు కావాలని తొలిగించిన సందర్భాలు ఉన్నాయి. ఇక మళ్లీ గుర్తించాలంటే చుట్టుపక్కల రైతల పొలాల్లో ఉన్న రాళ్ల నుంచి టిపన్ ప్రకారం కొలత చేయాల్సి ఉంటుంది. ఇందుకు చుట్టుపక్కల రైతులు సహకరించాలి. పొదలు, చెట్లు, రాళ్ల గోతులు, కాల్వలు అడ్డం ఉంటే గొలుసుతో కష్టమే. సర్వే అధికారులు వారి వద్ద ఉన్న జీపీఎస్ చిన్న యంత్రంతో చేస్తున్నారు. వాటితో లెక్కలు సరిపోల్చుకుంటారు. ప్రస్తుతం ఆధునిక డిజిటల్ (డీజీపీఎస్) యంత్రాలను వినియోగిస్తున్నారు. ఏమి అడ్డం ఉన్నా నిక్కచ్చిగా, వేగంగా సర్వే ఫలితం వస్తుంది. ప్రభుత్వం సైతం ఆ దిశలో పయనిస్తే వేగంతోపాటు, సమస్యలు తొలగిపోతాయి. అంతేకాకుండా ప్రభుత్వం కొత్తగా భూ సర్వే చేపడితే పట్టాదారులకు ఎంతో మేలు జరుగుతుంది.

రైతులు సహకరిస్తే..
ప్రస్తుతం సర్వే కోసం దరఖాస్తులు అధికంగా వస్తున్నాయి. చాలాచోట్ల చుట్టపక్కల రైతులు సహకరించకపోవడంతో సర్వేలు ముందుకు సాగక పెండింగ్‌లో పడుతున్నాయి. చాలామంది రైతులు పొలాలను భాగాలుగా చేయాలని అడుగుతారు. తాము కేవలం సర్వే హద్దులు గుర్తించి పొలం టిపన్ ప్రకారం ఉందా లేదా మాత్రమే చెబుతాం. భాగాలు విభజించడా నికి వీల్లేదు. దీంతో ప్రైవేట్ సర్వేయర్లను ఆశ్రయిస్తున్నారు.

– శ్రీనివాస్‌రెడ్డి, జిల్లా సర్వే అధికారి

భూ నిర్వాసితులను ఆదుకుంటాం



రైతులతో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ కసిరెడ్డి నారాయణరెడ్డి

వారకొండ: డిండి నార్లాపూర్ రిజర్వాయర్ **నిర్మాణంలో భాగంగా** గోకారం, చంద్రాయన్ **పల్లిలో భూములు కోల్పోయి** నిర్వాసితులైన ప్రతి ఒక్కరికి అండగా ఉండి ప్రభుత్వం నుంచి నష్టపరిహారం అందిస్తామని ఎమ్మెల్సీ కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. శనివారం మండలంలోని గోకారంలో పెండింగ్‌లో ఉన్న రిజర్వాయర్ నిర్మాణాన్ని, ధ్వంసమైన చెరువును ఎమ్మెల్సీ, మాజీ మంత్రి చిత్తరంజన్ దాస్ రైతులతో కలిసి పరిశీలిస్తారు. అనంతరం రైతులతో సమావేశమై మాట్లాడారు. గోకారం, చంద్రాయన్‌పల్లి, ఎర్రవల్లి గ్రామాల రైతులు అటు భూములు, ఇటు ఉపాధినిచ్చే చెరువును కోల్పోయి తీవ్రంగా నష్టపోయారని, ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి త్వరగా పరిహారం వచ్చేలా చూస్తానన్నారు. పెండింగ్ రిజర్వాయర్ పనులు చేపట్టే విధంగా కృషి చేస్తామని అన్నారు. చిత్తరంజన్ దాసు మాట్లాడుతూ రైతులకు న్యాయం జరిగే వరకు అండగా ఉంటామన్నారు. కార్యక్రమంలో నాయకులు జూపల్లి వెంకటయ్య యాదవ్, సంజీవ్ యాదవ్, సాంబయ్య గౌడ్, సురేందర్ రెడ్డి, భాస్కర్ రెడ్డి, రైతులు, గ్రామస్తులు ఉన్నారు.

బ్రిడ్జి పరిశీలన

వెల్దండ: వర్షాలకు బైరాపూర్ వాగుపై ఉన్న బ్రిడ్జి కొట్టుకుపోవడంతో శనివారం బ్రిడ్జిని ఎమ్మెల్సీ కసిరెడ్డి పరిశీలించారు. వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, త్వరగా నూతన బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలని గ్రామస్తులు కోరారు. ఇదిలాఉండగా, బైరాపూర్‌కి చెందిన కుమార్‌యాదవ్ ఏర్పాటు చేస్తున్న మినీ బ్యాంక్‌ను ఎమ్మెల్సీ ప్రారంభించారు.

దశాబ్ది ఉత్సవాలు ఘనంగా నిర్వహించాలి



వీసీలో మాట్లాడుతున్న కలెక్టర్ ఉదయ్‌కుమార్

నాగర్‌కర్నూల్: తెలంగాణ ఆవిర్భావ దినోత్సవంతో పాటు 21 రోజులపాటు జరిగే తెలంగాణ దశాబ్ది ఉత్సవాలను విజయవంతం చేయాలని కలెక్టర్ పి.ఉదయ్ కుమార్ ఆదేశించారు. శనివారం సాయంత్రం జూమ్ మీటింగ్ ద్వారా సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. జూన్ 2న జరిగే రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవానికి సంబంధిత అధికారులు తమకు కేటాయించిన బాధ్యతల వారీగా పూర్తి చేయాలన్నారు.

ఒక్కో రోజు ఒక్కో ప్రత్యేక కార్యక్రమం

జూన్2వ తేదీన జాతీయ పతాకావిష్కరణ, 3వ తేదీన రైతుదినోత్సవం, 4వ తేదీన సురక్షాదినోత్సవం, 5న విద్యుత్ దినోత్సవం, 6న పారిశ్రామిక ప్రగతి ఉత్సవం, 7న సాగునీటి దినోత్సవం నిర్వహించాలని కలెక్టర్ ఆదేశించారు. అలాగే, 8న ఊరూరా చెరువుల పండుగ, 9న సంక్షేమ సంబురాల నిర్వహణ, 10న సుపరిపాలన దినోత్సవం, 11న సాహిత్య దినోత్సవం, 12న తెలంగాణ రన్ కార్యక్రమం, 13న మహిళా శిశు సంక్షేమ దినోత్సవం, 14న వైద్యారోగ్య దినోత్సవం, 15న పల్లెప్రగతి దినోత్సవం, 16న పట్టణ ప్రగతి దినోత్సవం, 17న గిరిజన దినోత్సవం, 18న మంచినీళ్ల పండుగ, 19న హరితోత్సవం, 20న విద్యా దినోత్సవం, 21న ఆధ్యాత్మిక దినోత్సవం, 22వ తేదీన అమరుల సంస్మరణ కార్యక్రమాలను నిర్వహించేలా పకడ్బందీ ప్రణాళిక సిద్ధం చేయాలన్నారు. ప్రతి శాఖ తమ శాఖకు సంబంధించిన దశాబ్ది ఉత్సవాలను పకడ్బందీగా నిర్వహించేందుకు నోడల్ అధికారులను నియమించుకోవాలని ఆదేశించారు. అదనపు కలెక్టర్ మనుచౌదరి, అదనపు కలెక్టర్ మోతీలాల్, వివిధ శాఖల అధికారులుపాల్గొన్నారు.

'ఉపాధిహామీ'కి రూ.7.15 కోట్లు విడుదల

నాగర్‌కర్నూల్: జిల్లాలో 20 మండలాల వారీగా గ్రామాల్లో చేపట్టిన ఉపాధి హామీ అభివృద్ధి పనులకు వినియోగించాల్సిన ఎన్‌ఆర్‌ఈజీఎస్ మెటీరియల్ కాంపొండ్ సంబంధించి ఇప్పటివరకు మండలాల వారీగా ఎఫ్ టి ఓలు అప్లోడ్ చేసిన రూ.7.15 కోట్ల నిధులను విడుదల చేసినట్లు కలెక్టర్ ఉదయ్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని 20 మండలాల గ్రామాల్లో గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద వివిధ రకాల అభివృద్ధి పనులు చేసిన లబ్ధిదారులకు 2022 –23 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన మెటీరియల్ కాంపొండ్ నిధులు విడుదల అయ్యాయని తెలిపారు. అదేవిధంగా ఇంజనీరింగ్ విభాగం ద్వారా మన ఊరు మనబడి, సీసీ రోడ్లకు సంబంధించిన గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా చేపట్టిన పనుల మెటీరియల్ కాంపొండ్ నిధులను కూడా విడతల వారీగా చెల్లించడం జరుగుతుందని తెలిపారు.

సాగునీటి ప్రాజెక్టులపై చర్చకు సిద్ధం



వట్టెం రిజర్వాయర్ వద్ద మాట్లాడుతున్న భట్టి విక్రమార్క

- రాష్ట్రంలో నీటి పారుదల శాఖకు మంత్రే లేరు
- తొమ్మిదేళ్ల పాలనలో పాలమూరుకు ఒరగబెట్టింది శూన్యం
- వట్టెం రిజర్వాయర్ వద్ద సీఎల్పీ నేత భట్టి విక్రమార్క

సాక్షి, నాగర్‌కర్నూల్: పాలమూరు– రంగారెడ్డి ప్రాజెక్టు నిర్మాణంపై రాష్ట్ర ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదని సీఎల్పీ నేత భట్టి విక్రమార్క విమర్శించారు. ఆయన చేపట్టిన పీపుల్స్ మార్చ్ పాదయాత్ర శనివారం బిజినేపల్లి మండలం రాంరెడ్డిపల్లి క్రాస్ రోడ్డు నుంచి వట్టెం ప్రాజెక్టు రిజర్వాయర్ రోడ్డు నుంచి కారుకొండ, కుమ్మెర గ్రామాలకు చేరుకుంది. ఈ సందర్భంగా వట్టెం రిజర్వాయర్ వద్ద నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రాష్ట్రంలో నీటిపారుదల శాఖకు నాలుగున్నరేళ్లుగా మంత్రి కూడా లేరన్నారు. ఇన్‌చార్జ్ ఈఎన్‌సీ అధికారులను నియమించడంతోపాటు సంబంధిత మంత్రి లేక ప్రాజెక్టు పనులను సమీక్షించేవారే కరువయ్యారని చెప్పారు. ప్రాజెక్టు పేరిట పైపులు, పంపులు కొనడమే పనిగా పెట్టుకున్నారని, డబ్బులు స్వాహా చేయడం మినహా సాగునీటిపై ప్రభుత్వానికి ఆలోచన లేదని దుయ్యబట్టారు. ప్రాజెక్టు కింద రిజర్వాయర్ల నిర్మాణంలో నల్లమట్టి సేకరణపై టెండర్లను బయటపెట్టాలని డిమాండ్ చేశారు. ఏ ప్రాంతంలో సేకరించాలి.. ఎంత మేరకు సేకరించాలన్న నిబంధనలేమీ లేకుండా ఇష్టారీతిగా తవ్వకాలు చేపడుతున్నారని విమర్శించారు. ప్రజల కోసం కాకుండా కాంట్రాక్టర్ల లబ్ధికోసమే ప్రభుత్వం పనిచేస్తోందని, ప్రశ్నిస్తే కేసులు పెడుతున్నారని విమర్శించారు. ప్రాజెక్టు నిర్వాసితులకు 2013 భూసేకరణ చట్టం ప్రకారం పరిహారం ఇస్తామని సంతకాలు చేయించుకుని తర్వాత మోసం చేశారని ఆరోపించారు. తమ పర్యటన సందర్భంగా ప్రాజెక్టు కింద తమ భూములు లాక్కున్నారని చెబుతూ కారుకొండకు చెందిన రైతులు పెంటయ్య, మణెమ్మ, భాగ్యమ్మ కన్నీరు పెట్టుకున్నారని వివరించారు. బీఆర్‌ఎస్ నేతలు ఇసుక, మట్టి, భూములు అమ్ముకోవడంతో పాటు శ్మశానాలను సైతం వదలడం లేదని ఆరోపించారు. దళితులు, గిరిజనుల మెడ మీద కాలు పెట్టి తొక్కే సంస్కృతి నాగర్‌కర్నూల్‌లోనే చూస్తున్నామని దుయ్యబట్టారు. పాలమూరు– రంగారెడ్డి కింద ఒక్క చుక్క నీటిని కూడా ఎత్తిపోయలేదన్నది వాస్తవమని, కాదంటే తనతో చర్చకు రావాలని సవాల్ విసిరారు. బీఆర్‌ఎస్ పాలించిన తొమ్మిదిన్నరేళ్లలో ఉమ్మడి పాలమూరు జిల్లాకు ఒరగబెట్టింది శూన్యమని పేర్కొన్నారు.

ఏం కేసులు వేశామో బయటపెట్టాలి
సాగునీటి ప్రాజెక్టులను ఆపాలని కాంగ్రెస్ నాయకులు కోర్టుల్లో కేసులు వేశారని అసత్య ప్రచారం చేస్తున్న కేసీఆర్ తాము ఏం కేసులు వేశామో బయటపెట్టాలన్నారు. అన్యాయం జరిగినప్పుడు రాజ్యాంగబద్ధంగా ఏర్పాటైన న్యాయస్థానాలకు వెళ్లి న్యాయం కోరుతారని, ఆ న్యాయస్థానాలు ప్రభుత్వానికి వ్యతిరేకంగా తప్పుడు తీర్పులు ఇచ్చారని అనుకుంటే ఈ పాలకులు దమ్ముంటే కోర్టులను కూడా నిషేధించాలని సవాల్ విసిరారు. ప్రాజెక్టులు నిర్మించాలనే చిత్తశుద్ధి నిజంగా ఉంటే చట్టబద్ధంగా వెళితే ఏ కోర్టు ఆపదన విషయం ఈ ప్రభుత్వానికి తెలియదా అని, అన్యాయం ఉంటేనే కదా ఆపమని కోర్టులు ఆర్డర్లు ఇస్తాయన్నారు. కేసులు వేసిన కొల్లాపూర్ ఎమ్మెల్యే హర్షవర్ధన్‌రెడ్డి పాత బిల్లులకు రావాల్సిన రూ.6 లక్షలకు బదులు రూ.26 కోట్లు ఇచ్చి బీఆర్‌ఎస్‌లో చేర్చుకున్న కేసీఆర్ కాంగ్రెస్‌పై ఆరోపణలు చేయడం సరికాదన్నారు.

ఆయన 'మట్టి' జనార్దన్‌రెడ్డి..
'నాగర్‌కర్నూల్ నియోజకవర్గంలోని తిమ్మాజిపేట, బిజినేపల్లి మండలాల్లో పర్యటిస్తుంటే ప్రజలంతా స్థానిక ఎమ్మెల్యే మర్రి కాదు.. మట్టి జనార్దన్‌రెడ్డి అని చెబుతున్నారని భట్టి విక్రమార్క అన్నారు. ఆయన ప్రజల కోసం పనిచేయకుండా కాంట్రాక్టు కంపెనీల లబ్ధి కోసం పనిచేస్తున్నారని, వారికి ఏజెంట్‌లా మారి చెరువుల్లో నల్లమట్టిని అమ్ముకుంటున్నారని ఆరోపించారు. చెరువుల్లో నిర్దిష్ట ప్రమాణాల మేరకే మట్టిని తవ్వుకోవాలి.. కానీ, ఇక్కడ అలాంటిదేం లేకుండా చెరువుల గర్భంలో 10 నుంచి 12 మీటర్ల లోతు వరకు తవ్వి మట్టిని తరలిస్తున్నారని, దీంతో చెరువుల్లో నీరు ఇంకిపోయే పరిస్థితి ఉండదు' అన్నారు. ఎమ్మెల్యేగా గెలిచాక ఆయనకు చెందిన వస్త్ర దుకాణాలు మాత్రం 16కు పెరిగాయని, పదేళ్లలో ఆయన ప్రజలకు చేసిందేంటో చెప్పాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో టీపీసీసీ ఉపాధ్యక్షుడు మల్లురవి, డీసీసీ అధ్యక్షుడు వంశీకృష్ణ, జెడ్పీటీసీ సభ్యులు రోహిణి, సుమిత్ర, నాయకులు అర్థం రవి, సుహాసన్‌రెడ్డి, బాలాగౌడ్, కోటయ్య, రాము, పాండు తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌తోనే పాలమూరు అభివృద్ధి

- ఆగస్టులో 'పాలమూరు' ద్వారా కృష్ణాజలాలు
- 5 మెడికల్ కళాశాలలు, నియోజకవర్గానికో 100 పడకల ఆస్పత్రి
- ఎక్కడికక్కడ నయం చేసేందుకు బస్తీ దవాఖానాల ఏర్పాటు
- కాంగ్రెస్‌కు 50 సీట్లలో అభ్యర్థులే లేరు
- రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావు



జడ్చర్లలో మాట్లాడుతున్న హరీశ్‌రావు.. పక్కన ఎంపీ శ్రీనివాస్‌రెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ స్వర్ణసుధాకర్‌రెడ్డి, కలెక్టర్ రవినాయక్, ఎస్పీ కె.నరసింహ, ఎమ్మెల్యేలు లక్ష్మారెడ్డి, ఆల వెంకటేశ్వర్‌రెడ్డి తదితరులు

జడ్చర్ల/ జడ్చర్ల టౌన్: పాలమూరు– రంగారెడ్డి ప్రాజెక్టును పూర్తి చేసి వచ్చే జులై, ఆగస్టు నెలల్లో సాగునీరు అందిస్తామని, త్వరలోనే కృష్ణాజలాలు జడ్చర్లను ముద్దాడబోతున్నాయని రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి హరీశ్‌రావు అన్నారు. శనివారం జడ్చర్లలో రూ.30 కోట్లతో నిర్మించిన వంద పడకల ఆస్పత్రిని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ ఉమ్మడి పాలమూరు జిల్లా అభివృద్ధి బీఆర్‌ఎస్ హయాంలోనే జరిగిందని, కేసీఆర్ కృషివల్లే అనేక రంగాల్లో ముందుకెళ్లామన్నారు. పాలమూరు– రంగారెడ్డి ప్రాజెక్టును అడ్డుకునేందుకు కాంగ్రెసోళ్లు ప్రయత్నించినప్పటికీ ఆపలేరన్నారు. వైద్యశాఖ పరంగా ఉమ్మడి జిల్లాలో 5 మెడికల్ కళాశాలలు వచ్చాయని, జడ్చర్ల, అచ్చంపేట, అలంపూర్, కొల్లాపూర్, కొడంగల్, షాద్‌నగర్‌లలో వంద పడకల ఆస్పత్రులు ఏర్పాటు చేశామన్నారు. దేవరకద్రకు త్వరలోనే మంజూరు చేస్తామన్నారు. అలాగే ఫిషరీస్ కళాశాలతోపాటు వ్యవసాయ కళాశాల ఇచ్చామన్నారు. బస్తీ దవాఖానాలు ఎన్నో ఇచ్చామని, జడ్చర్లలోనే 5 ఏర్పాటు చేశామన్నారు. వీటిని జిల్లా ఆస్పత్రి తరహాలో అన్నిరకాల వైద్యసేవలు అందించేలా తీర్చిదిద్దామన్నారు. నాడు వైద్య, ఆరోగ్యశాఖ మంత్రిగా ఉన్న లక్ష్మారెడ్డి వంద పడకల ఆస్పత్రిని మంజూరు చేసుకున్నారని గుర్తుచేశారు. అందుబాటులో స్థలం లేకుంటే స్వయంగా డబ్బులు ఇచ్చి అసైన్డ్ క్లియర్ చేయించారని అభినందించారు. నవాబ్‌పేట మండలానికి 30 పడకల ఆస్పత్రిని త్వరలోనే మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. మన పథకాలు మిషన్ కాకతీయ, భగీరథ, గురుకులాలు, కల్యాణలక్ష్మి, రైతుబంధు, జిల్లాకో మెడికల్ కళాశాల, కంటి వెలుగులు ఇవన్నీ కూడా దేశం అంతా కాపీ కొట్టి అమలు చేస్తుంటే.. రాష్ట్రంలో ప్రతిపక్షాలు కళ్లులేని కబోదుల్లా మాట్లాడుతున్నారన్నారు. కేసీఆర్‌కు ముందు తెలంగాణ కోసం అనేక పార్టీలు పుట్టినయ్ కానీ.. పదవులు రాగానే తెలంగాణను మరిచిపోయారన్నారు. కేసీఆర్ మాత్రం గమ్యాన్ని ముద్దాడేదాకా తన ప్రాణాన్ని సైతం లెక్కచేయకుండా ప్రత్యేక రాష్ట్రం సాధించారని కొనియాడారు. రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న పథకాలు అందని ఇళ్లే లేవని, రేవంత్ చెప్పిన విధంగా ఓట్లు అడిగితే ఒక్క ఓటు కూడా వారికి పడదన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీకి 50 సీట్లలో అభ్యర్థులే లేరని ఎద్దేవా చేశారు.

పరువు తీస్తున్న రేవంత్

రేవంత్‌రెడ్డి పాలమూరు జిల్లా పరువు తీస్తున్నారని ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి మండిపడ్డారు. రాజకీయాలను అసహ్యించుకునే విధంగా వ్యవహరిస్తున్నారని, తప్పుడు మాటలు మాట్లాడుతున్నారని దుయ్యబట్టారు. రాజకీయ భిక్ష పెట్టిన మిడ్జిల్ మండలానికి ఆయన చేసిందేమీ లేదన్నారు. ఎంపీ శ్రీనివాస్‌రెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ స్వర్ణసుధాకర్‌రెడ్డి, రాష్ట్ర వైద్య విధాన పరిషత్ కమిషనర్ రామారావు, టీఎస్‌ఎంఐడీసీ ఎర్రోళ్ల శ్రీనివాస్, కలెక్టర్ రవినాయక్, ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

మూడోసారి కేసీఆరే సీఎం..
రాష్ట్రంలో మూడోసారి బీఆర్‌ఎస్ అధికారంలోకి రావడం ఖాయమని, కేసీఆర్ ముఖ్యమంత్రిగా మూడోసారి బాధ్యతలు స్వీకరించి మరింత అభివృద్ధి చేస్తారని రాష్ట్ర ఎక్సైజ్, క్రీడాశాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. తండ్రిలాంటి కేసీఆర్‌ని టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి వాడు వీడు అని సంబోధించడం సరికాదన్నారు. తొమ్మిదేళ్లలో తెలంగాణ అభివృద్ధి చేయలేదని మాట్లాడుతున్నారని, రాష్ట్రం రాక ముందు చదువుకునేందుకు పాఠశాలలు సక్రమంగా ఉండేవి కావని.. ఇప్పుడు 110 గురుకులాలు ఏర్పాటు చేసుకున్నామని గుర్తుచేశారు. దేశంలో అత్యధిక అవార్డులు సాధించిన రాష్ట్రం తెలంగాణ అని, అందులో మహబూబ్‌నగర్ జిల్లాకు రెండు అవార్డులు వచ్చాయన్నారు. నాడు హోటళ్లలో టీ తాగితేనే మంచినీళ్లు ఇస్తామని చెప్పేవారని, ఇప్పుడా పరిస్థితి ఉందా అని ప్రశ్నించారు. చిన్నకులపోళ్లను అవమానపరుస్తుంటారని, జడ్చర్ల సభలో పిచ్చకుంట్లోళ్లు అని సంబోధించారన్నారు. కులపోళ్లను తిడుతున్నారని మీరు చేసే పనికి మేం తిట్లు తినాల్సి వస్తుందని కాంగ్రెస్ నాయకులపై మండిపడ్డారు.

మంత్రి నిరంజన్‌రెడ్డి వెంటే కొనసాగుతా..
వనపర్తి జెడ్పీ చైర్మన్ ఆర్.లోక్‌నాథ్‌రెడ్డి



విలేకరులతో మాట్లాడుతున్న లోక్‌నాథ్‌రెడ్డి

వనపర్తి: తనను గెలిపించిన ప్రజలు, తనను జెడ్పీ చైర్మన్‌గా బలపరిచిన జెడ్పీ సభ్యుల అభ్యర్థన మేరకు జిల్లా అభివృద్ధి కోసం వ్యవసాయశాఖ మంత్రి నిరంజన్‌రెడ్డి వెంటే కొనసాగుతానని వనపర్తి జెడ్పీ చైర్మన్ ఆర్. లోక్‌నాథ్‌రెడ్డి వెల్లడించారు. శనివారం స్థానిక జెడ్పీ కార్యాలయంలో ఆయన స్థానిక బీఆర్‌ఎస్ నాయకులతో కలిసి విలేకరులతో మాట్లాడారు. కొన్ని మనస్పర్థలతో ఆత్మగౌరవం పేరిట పలువురు నాయకులతో కలిసి మార్చి 9న పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేసిన జెడ్పీ చైర్మన్ మళ్లీ మంత్రితోపాటే బీఆర్‌ఎస్‌లో కొనసాగాలని నిర్ణయించుకున్నట్లు స్పష్టం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాను మంత్రిని వ్యక్తిగతంగా దూషించలేదని, కేవలం అడ్మినిస్ట్రేషన్, సమాచారం లోపం వల్లనే విభేదాలు వచ్చాయన్నారు. వనపర్తి తొలి జెడ్పీచైర్మన్‌గా పూర్తి పదవీకాలం ప్రజలకు సేవ చేయాలనే ఉద్దేశంతో ముందుకు సాగుతున్నట్లు పేర్కొన్నారు. పార్టీని వీడినా.. తాను ఏ పార్టీలోనూ చేరకుండా కొంతమంది సన్నిహితులు, జెడ్పీటీసీ సభ్యులతో చర్చించి తగు నిర్ణయం తీసుకోవాలనుకుని ఇన్నాళ్లు వేచిచూశానన్నారు. సమావేశంలో మార్కెట్ కమిటీ చైర్మన్ రమేష్‌గౌడ్, మున్సిపల్ వైస్‌చైర్మన్ శ్రీధర్, నాయకులు శ్యాం, శ్రీను, కోటేశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

వడదెబ్బతో 'ఉపాధి' కూలీ మృతి


వెంకటయ్య (ఫైల్)

బిజినేపల్లి: మండలంలోని వెల్గొండ చెందిన వెంకటయ్య (57) శుక్రవారం ఉపాధి కూలీకి వెళ్లి వడదెబ్బతో రాత్రి మృతి చెందాడు. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం వెల్గొండ చెందిన వెంకటయ్య రోజువారీగా ఉపాధి పనులకు వెళ్లేవాడు. ఈ క్రమంలో వడదెబ్బకు గురై శుక్రవారం సాయంత్రానికి అస్వస్థతతో ఇంటికి చేరుకున్నాడు. రాత్రి వరకు తీవ్ర అనారోగ్యానికి గురి కాగా నాగర్‌కర్నూల్ ఏరియా ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తుండగా మృతి చెందాడు. వెంకటయ్యకు కూతురు, భార్య ఉన్నారు.

అనుమానాస్పద స్థితిలో హిజ్రా మృతి


మహేశ్వరి (ఫైల్)

అలంపూర్: అనుమానాస్పద స్థితిలో హిజ్రా మృతి చెందిన సంఘటన అయిజ పట్టణంలోని కొత్తబస్టాండ్ సమీపంలో శనివారం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే అయిజకు చెందిన హిజ్రా మహేష్ అలియాస్ మహేశ్వరి(33) ఉప్పలదొడ్డి కాలనీలో ఉంటుంది. శనివారం సాయంత్రం కొత్తబస్టాండ్ సమీపంలోని మరుగుదొడ్డి వెనుకభాగంలో శవమై కనిపించింది. ఎవరైనా హత్యచేశారా లేక సాధారణంగా మృతి చెందిందా అనే వివరాలు తెలియరాలేదు. మృతదేహాన్ని కుటుంబసభ్యులు ఇంటికి తరలించారు. ఈ విషయమై ఎస్‌ఐ నరేష్‌కుమార్‌ను వివరణ కోరగా తమ దృష్టికి రాలేదని తెలిపారు.

చికిత్స పొందుతూ రైతు..

బల్మూర్: వ్యవసాయ పొలంలో ఈనెల 10న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ వద్ద షాక్‌తో గాయపడిన మండల కేంద్రానికి చెందిన రైతు ముచ్చర్ల లింగయ్య(55) చికిత్స పొందుతు హైదరాబాద్‌లో శుక్రవారం రాత్రి మృతి చెందినట్లు ఎస్‌ఐ శివానందంగౌడ్ తెలిపారు. సంఘటనపై మృతుని భార్య లాలమ్మ ఫిర్యాదు మేరకు శనివారం కేసు నమోదు చేసినట్లు తెలిపారు. కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్తులు కోరారు.

డీఎల్ఐ కాల్వలో పడి యువకుడి మృతి


వినోద్ (ఫైల్)

వంగూరు: మండలంలోని నర్సంపల్లి సమీపంలో ఉన్న డీఎల్ఐ కాల్వలతో ఈతకు వెళ్లిన యువకుడు మృతి చెందాడు. వివరాలు ఇలా ఉన్నాయి.. అచ్చంపేట మండలం సింగారం చెందిన గండికోట వినోద్(18) వంగూరు మండలం నర్సంపల్లిలో చిన్నమ్మ కూతురు వివాహానికి వచ్చాడు. శనివారం ఈతకు వెళ్లి ప్రమాదవశాత్తు కాల్వలో పడి మృతి చెందాడు. మృతుడు వినోద్ తల్లిదండ్రులు చిన్నప్పుడే మృతి చెందారు. నాయనమ్మ సంరక్షణలో పెరిగిన వినోద్ పుట్టు మూగ, చెవులు మాత్రమే వినిపించేవని బంధువులు తెలిపారు.

పెళ్లి ఇష్టంలేక యువతి ఆత్మహత్య

నారాయణపేట రూరల్: వివాహం చేసుకోవడం ఇష్టంలేక ఓ యువతి ఆత్మహత్య చేసుకుంది. ఎస్‌ఐ సురేష్‌గౌడ్ తెలిపిన వివరాలు... పట్టణంలోని బహార్‌పేట వీధికి చెందిన బి.యశోద(20) కొంతకాలంగా అనారోగ్య సమస్యతో బాధపడుతోంది. ఆమెకు వివాహం చేయాలని తల్లిదండ్రులు భావించారు. తనకు ఇష్టం లేకపోవడంతో శనివారం మధ్యాహ్నం కొండారెడ్డిపల్లి చెరువుతో దూకి ఆత్మహత్యకు పాల్పడింది. ఆమెతల్లి మాణిక్యమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని పోలీసులు తెలిపారు.

వ్యక్తి బలవన్మరణం

మహబూబ్‌నగర్ క్రైం: జులాయిగా తిరుగుతూ మద్యానికి బానిసైన ఓ వ్యక్తి ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. రూరల్ ఎస్‌ఐ వెంకటేశ్వర్లు కథనం ప్రకారం.. మండలంలోని దివిటిపల్లి డబుల్ బెడ్‌రూంలో నివాసం ఉండే అబ్దుల్ సాజీద్(36) సైకిల్ రిపేర్ చేస్తూ జీవనం సాగించేవాడు. గత ఎనిమిదేళ్ల కిందట భార్య వదిలిపెట్టి పోవడంతో అప్పటి నుంచి మద్యానికి బానిసై ఎలాంటి పనులు చేయకుండా జులాయిగా తిరిగేవాడు. ఈ క్రమంలో శుక్రవారం రాత్రి 9 గంటల ప్రాంతంలో మద్యం తాగడానికి తల్లిని డబ్బులు అడగగా.. ఆమె లేవని చెప్పి ఇంట్లో నిద్రపోగా ఆ తర్వాత అబ్దుల్‌సాజీద్ ప్లాస్టిక్ తాడుతో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటనపై సాజీద్ అక్క జరీనా బేగం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యం



రాజాపూర్: మండలంలోని రంగారెడ్డిగూడలో గుర్తు తెలియని 46ఏళ్ల వ్యక్తి మృతదేహం శనివారం గుర్తించినట్లు ఎస్‌ఐ వెంకట్‌రెడ్డి తెలిపారు. గ్రామంలోని ఓ షటర్ వద్ద మృతదేహాన్ని గ్రామస్తులు గుర్తించి సమాచారం ఇవ్వడంతో కేసు నమోదు చేసి, జడ్చర్ల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

రియల్ మాయ!


మల్లెబోయిన్‌పల్లి శివారులోని చెరువును పూడుస్తున్న రియల్ వ్యాపారులు (ఫైల్)

కనుమరుగవుతున్న చెరువులు, కుంటలు
- పేట్రేగిపోతున్న వ్యాపారులు
- చోద్యం చూస్తున్న అధికారులు

జడ్చర్ల: నియోజకవర్గంలో దశాబ్దాల క్రితం ఏర్పాటుచేసిన చెరువులు, కుంటలను రియల్ వ్యాపారులు ధ్వంసం చేసి వెంచర్లు, ఫాం ల్యాండ్స్ తదితర కమర్షియల్ భూములుగా మార్చి సొమ్ము చేసుకుంటున్నారు. ఇప్పటికే చాలా వరకు వెంచర్లలో కలిసిపోయి కనీసం అక్కడ చెరువుందన్న దాఖలాలు లేకుండా మార్చేశారు.

ఊటకుంటలు, చెక్‌డ్యామ్‌లు సైతం..

భూగర్భ జలాల పెంపునకు వాటర్‌షెడ్ పథకం కింద రూ.లక్షలు వెచ్చించి నిర్మించిన ఊటకుంటలు, చెక్‌డ్యామ్‌లు, గల్లీ కంట్రోల్(రాతి కట్టడాలు) నిర్మాణాలను సైతం కూల్చివేశారు. ఇప్పటికే పలు గ్రామాల పరిధిలో వెంచర్లకు అడ్డుగా ఉన్న వాటిని తొలగించారు.

నిబంధనలు గాలికి..

ప్రభుత్వ నిబంధనలను రియల్ వ్యాపారులు ఏమాత్రం పట్టించుకోవడం లేదు. కొన్ని చెరువులు, కుంటల్లో పట్టా భూములు ఉన్నాయని.. అమ్ముకోవడం, వెంచర్లు చేయడం చెల్లుతుందని వ్యాపారులు వాదిస్తున్నారు. అయితే చెరువులు, కుంటల్లో ఉన్న శిఖం భూములు ఏక్‌సాల్ పట్టా కిందకు వస్తాయని.. నీట మునిగినప్పుడు వదిలేసి, నీరు లేని సమయంలో పంటలు సాగు చేసుకోవచ్చని రెవెన్యూ అధికారులు చెబుతున్నారు. చెరువుల శిఖం, బఫర్ జోన్‌తో పాటు కాల్వల్లో నిర్మాణాలు చేపట్టవద్దని ఇరిగేషన్‌శాఖ అధికారులు పేర్కొంటున్నారు.

విచారిస్తేనే వెలుగులోకి..

అధికారులు దృష్టి సారించి సమగ్ర విచారణ చేపడితే గ్రామాలు, పట్టణాల పరిధిలో ఆక్రమణలు, ఆనవాళ్లు కోల్పోయిన చెరువులు, కుంటల వివరాలు బయటకు వస్తాయని ప్రజలు పేర్కొంటున్నారు. ఇప్పటికైనా చర్యలకు ఉపక్రమించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

చర్యలు తీసుకోవాలి..



జడ్చర్ల శివారులోని నల్లచెరువుతో పాటు బూరెడ్డిపల్లి శివారులోని కుంటలు ఆక్రమణలకు గురయ్యాయి. కట్టలను పెకిలించి నామరూపాలు లేకుండా చేశారు. ప్రభుత్వం వాటిని సంరక్షించేందుకు చర్యలు తీసుకోవాలి.
– అనిల్‌కుమార్, సామాజికవేత్త, జడ్చర్ల

ఆక్రమణలు నేరం..



చెరువులు, కుంటలు ఆక్రమించడం, వెంచర్లుగా మార్చడం నేరం. అలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటాం. రికార్డుల్లో లేని చెరువులు, కుంటలను కొందరు తొలగిస్తున్నట్లు సమాచారం. బూరెడ్డిపల్లి శివారులో చెరువు కట్టకు గండి పెట్టిన విషయం తెలియడంతో విచారణ చేపట్టాం. గ్రామస్తులు మా దృష్టికి తీసుకొస్తే చర్యలు తీసుకుంటాం.
– లక్ష్మీనారాయణ, తహసీల్దార్, జడ్చర్ల


బూరెడ్డిపల్లి శివారులోని చెరువుకట్టకు గండి

మచ్చుకు కొన్ని..

జడ్చర్ల మండలం మల్లెబోయిన్‌పల్లి, బూరెడ్డిపల్లి శివారులో ఉన్న గండెమ్మ చెరువును తొలగించి వెంచర్‌లో కలిపేశారు. ఇదే వెంచర్‌ను ఆనుకొని ఉన్న మురుగువానికుంట కట్టను కూడా ఆక్రమించేందుకు విశ్వ ప్రయత్నం చేస్తున్నారు. గతంలో ఓసారి చెరువుకట్టను తొలగించే ప్రయత్నం చేయగా.. రైతులు అధికారులకు ఫిర్యాదు చేయగా స్పందించి కట్టను పునరుద్ధరించారు. ఇటీవల మరోసారి వెంచర్ యజమానులు కుంటకట్టను పొక్లెయిన్‌తో గండి కొట్టారు. దీంతో కుంటలోని నీరంతా ఒక్కసారిగా బయటకు పారగా కుంటకింద సాగు చేసిన వరి పంటలకు తీవ్ర నష్టం వాటిల్లింది. దీంతో రైతులు మరోసారి అధికారులకు ఫిర్యాదు చేయడంతో మళ్లీ చెరువు గండిని పూడ్చారు.

- బాదేపల్లిలోని ఊరచెరువులో సైతం వెంచర్ ఏర్పాటు చేశారు.
- జడ్చర్ల చెరువు శిఖంలోనూ ప్లాట్లు చేశారన్న ఫిర్యాదులు ఉన్నాయి.
- గంగాపూర్ శివారులోని వెంగళాయకుంటను సైతం నామరూపాలు లేకుండా చేసి వెంచర్‌లో కలిపేశారు. ఇదే గ్రామ పరిధిలోని నాగులకుంటను కూడా ఆక్రమించే ప్రయత్నం చేయగా గ్రామస్తులు అధికారులకు ఫిర్యాదు చేయడంతో ఆగిపోయింది.
- బాలానగర్‌లోని ఎర్రకుంటను కూడా మాయం చేశారని గ్రామస్తులు చెబుతున్నారు.
- మోతీఘణాపూర్ పరిధిలోని కోమటి చెరువును కూడా ఆక్రమించే పరిస్థితి ఉందని గ్రామస్తులు తెలిపారు.

కేసీఆర్ నాటకాలను ప్రజలు నమ్మరు


మాట్లాడుతున్న డీకే అరుణ

ధరూరు: ఎంతో మంది బలిదానాలతో ఏర్పడ్డ తెలంగాణ రాష్ట్రాన్ని కేసీఆర్ కుటుంబమంతా దోచుకున్నారని.. అవినీతిమయమైన బీఆర్‌ఎస్ పార్టీని ప్రజలు తరిమికొట్టే రోజులు దగ్గరలోనే ఉన్నాయని.. కేసీఆర్ నాటకాలు.. జిమ్మిక్కులు ఇక సాగవని బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ తీవ్రస్థాయిలో మండిపడ్డారు. జెండా కార్యక్రమాల్లో భాగంగా రెండో రోజైన శనివారం మండల పరిధిలోని పెద్దపాడు, భీంపురం, చిన్నపాడు, పారుచర్ల, సోంపురం, దోర్నాల, గుర్రంపల్లి, మన్నాపురం గ్రామాల్లో ఆమె పర్యటించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. రాష్ట్రంలో ఎన్నో ప్రజా సమస్యలు ఉన్నా.. అవేవీ పట్టకుండా రాష్ట్ర ప్రజలను మాటల గారడీతో మోసం చేస్తున్నారన్నారు. ప్రజాసంక్షేమాన్ని గాలికి వదిలి ఇంటిల్లిపాది పదవులు పొంది రాష్ట్రాన్ని దోచుకుతింటున్నారన్నారు. ఎంతోమంది బలిదానాలతో ఏర్పడ్డ తెలంగాణను కేసీఆర్ తాను తెచ్చినట్లు గొప్పలు చెప్పుంటున్నారని ఆరోపించారు. కేసీఆర్‌కు చిత్తశుద్ధి లేదన్నారు. ఉచిత ఎరువులు ఇస్తానని చెప్పి ఐదేళ్లు గడుస్తున్నా హామీ మాత్రం మిగిలిపోయిందన్నారు. ఎకరాకు రూ.20వేలు చొప్పున కేంద్ర ప్రభుత్వం సబ్సిడీ ఇస్తుందన్నారు. ఉచిత ఎరువులని చెప్పి మోసం చేశారన్నారు. రైతులకు సబ్సిడీలు బందు చేసి రైతుబంధు ఇస్తున్నారన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ దాదాపు యూరియాపై 300 ఉంటే 300 సబ్సిడీ ఇస్తున్నారన్నారు. డీఏపీ రూ.2,500కు గాను సగానికి సగం సబ్సిడీ ఇస్తున్నారన్నారు. రాష్ట్రంలో ప్రజా వ్యతిరేకత ప్రారంభమైందన్నారు. రానున్న ఎన్నికల్లో మరోసారి కేసీఆర్ ప్రజలను మోసం చేస్తారని, జాగ్రత్తగా ఉండాలని సూచించారు. ఈకార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు రాంచంద్రారెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గడ్డం కృష్ణారెడ్డి, అసెంబ్లీ కన్వీనర్ రామాంజనేయులు, పట్టణ అధ్యక్షులు బండల వెంకట్రాములు, మండల అధ్యక్షులు రాజేష్, నాయకులు సంజీవ్ భరద్వాజ్, వెంకటేశ్వరరెడ్డి, అంజురెడ్డి, హన్మంతరాయ, తోట రాములు, పెద్దపాడు నర్సింహులు, సత్యన్న పాల్గొన్నారు.

'తెలంగాణను అప్పుల రాష్ట్రంగా మార్చారు'

స్టేషన్ మహబూబ్‌నగర్: తెలంగాణను బీఆర్‌ఎస్ ప్రభుత్వం అప్పుల రాష్ట్రంగా మార్చిందని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి ఎస్.వినోద్‌కుమార్ ఆరోపించారు. మహబూబ్‌నగర్‌లోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జడ్చర్లలో రేవంత్‌రెడ్డి చేసిన సవాల్‌ను ఉమ్మడి జిల్లా మంత్రులు స్వీకరించాలని డిమాండ్ చేశారు. ఉమ్మడి జిల్లా అభివృద్ధిపై సవాల్‌ను స్వీకరించకుండా అర్థరహితంగా మాట్లాడడం సరికాదన్నారు. కాంగ్రెస్ పార్టీ ఏమి చేసిందని మంత్రులు అంటున్నారని, ఉమ్మడి జిల్లాలో సాగునీటి ప్రాజెక్టులకు రూపకల్పన చేసింది కాంగ్రెస్ పార్టీయేనని గుర్తుచేశారు. కోయిల్‌సాగర్, జూరాల, నెట్టెంపాడు, భీమా, కల్వకుర్తి ఎత్తిపోతలను నిర్మించింది కాంగ్రెస్ పార్టీ అన్న విషయాన్ని మంత్రులు మరచిపోకూడదని హితవు పలికారు. నిరుపేదలకు భూములు ఇచ్చింది, ప్రజల ఆకాంక్షను గుర్తించిన కాంగ్రెస్ పార్టీ సోనియాగాంధీ నాయకత్వంలో ప్రత్యేక తెలంగాణ రాష్ట్రాన్ని ఏర్పాటు చేసిందని తెలిపారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం రైతుబంధు పేరుతో రైతుల సంక్షేమాన్ని విస్మరించిందని, ఎరువుల సబ్సిడీని, ఎస్సీ, ఎస్టీల ఉచిత బోరు సౌకర్యాన్ని ఎత్తివేశారని ఆరోపించారు. అభివృద్ధిపై ఉమ్మడి జిల్లా మంత్రులు చర్చకు రావాలని ఆయన డిమాండ్ చేశారు. సమావేశంలో జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు వసంత, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు సాయిబాబా, నాయకులు రాఘవేందర్‌రాజు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న టీపీసీసీ ప్రధాన కార్యదర్శి వినోద్‌కుమార్

ఊటకుంటలు పరిశీలించిన సీఆర్‌డీ బృందం


పెద్ద వార్వాలలో ఊటకుంటలను పరిశీలిస్తున్న సీఆర్‌డీ బృందం

గండేడ్: అమృత్ సరోవరం చెరువుల నిర్మాణంలో భాగంగా మండలంలోని జంగంరెడ్డిపల్లి, రంగారెడ్డిపల్లి, జానంపల్లి, వెన్నచేడ్ బొాస్‌పల్లి, చెల్మిల్లా, పెద్దవార్వల్, చిన్నవార్వల్, మహమ్మదాబాద్ మండలంలోని మొకర్లాబాద్, నంచర్ల గ్రామాల్లోని చెరువులను, ఊట కుంటలను శనివారం సీఆర్‌డీ బృందం పరిశీలించింది. ఈ సందర్భంగా జేక్యూసీఓ సంధ్య మాట్లాడారు. అమృత్ సరోవర్‌లో భాగంగా ఉమ్మడి మండలంలోని 15 చెరువులను కుంటలను నిర్మించించినట్లు తెలిపారు. కట్టనిర్మాణాలు, తూము, కాల్వలు, అలుగుల నాణ్యతపై నివేదికను కేంద్రానికి పంపుతామని తెలిపారు. ఊటకుంటలతో గ్రౌండ్ వాటర్ పెరిగిందా లేదా ప్రయోజనాలపై చుట్టుపక్కల రైతులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఆర్‌క్యూసీఓ సత్తయ్య, ఎంపీడీఓ రూపేందర్‌రెడ్డి, ఏపీఓ హరిచంద్రుడు, ఏపీడీ మంజుల, ఈసీ ఆంజనేయులు, టీఏలు, ఫీల్డ్ అసిస్టెంట్లు పంచాయతీ కార్యదర్శులు ఉన్నారు.

రొప్పుకుంట పరిశీలించిన రాష్ట్ర బృందం

రాజాపూర్: మండల పరిధిలోని చెన్నవెల్లి గ్రామ శివారులో గల రొప్పుకుంటను శనివారం ఎస్‌క్యూసీఓ రాష్ట్ర బృందం అధికారులు సందర్శించారు. కుంటలో సిల్ట్ ఎంత తీశారని, తీసిన శిల్ట్ రైతుల పొలాల్లో వేయడం వివరాలను గ్రామసర్పంచ్‌తో పాటు అధికారులను అడిగి తెలుసుకున్నారు. రాష్ట్ర బృందం స్టేట్‌టీమ్ అధికారి రబ్బానితో పాటు ఎంపీడీఓ లక్ష్మీదేవి, ఏపీఓ భారతి, ఈసీ హరిసింగ్, టీఏ సుజాత పంచాయతీ కార్యదర్శి శాలిని సర్పంచ్ రాధ వెంకట్‌రామ్‌రెడ్డి, పాల్గొన్నారు.

హుండీ చోరీ

- కేసు నమోదు


సమీపంలోని చెరువు పరిసరాల్లో గుర్తించిన హుండీ

గద్వాల క్రైం: జములమ్మ ఆలయంలోని పరశురాముడి హుండీని గుర్తుతెలియని వ్యక్తులు అపహరించినట్లు ఎస్‌ఐ ఆనంద్, ఏఈఓ కవిత తెలిపారు. రెండు నెలల నుంచి భక్తులు వేసిన కానుకలు హుండీలోనే ఉన్నాయని.. ఎంత డబ్బు ఉందనే దానిపై స్పష్టత లేదన్నారు. ప్రస్తుతం జములమ్మ ఉత్సవాలు కొనసాగుతున్నాయని.. ప్రతి మంగళ, శుక్రవారం 60 వేలకుపైగా భక్తులు ఆలయాన్ని దర్శించుకొని తమకు తొచ్చినంత నగదుతో పాటు వెండి, బంగారాన్ని హుండీలోనే వేస్తారని, ఇది గుర్తించి అపహరణకు పాల్పడినట్లు అనుమానం వ్యక్తం చేశారు. ఆలయ సమీపంలోని చెరువు పరిసరాల్లో హుండీని పగలగొట్టి అందులోని నగదు, బంగారం, వెండిని ఎత్తుకెళ్లారు. ఆలయంలోని సీసీ కెమెరాల్లో దొంగల కదలికలు కనిపించాయి. డాగ్ స్క్వాడ్ ఆలయ పరిసరాల్లో సంచరించింది. ఏఈఓ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ వివరించారు.

ఆంజనేయస్వామి ఆలయంలో..

పెబ్బేరు: పట్టణంలోని మిట్ట ఆంజనేయస్వామి ఆలయంలో మంగళవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు స్వామివారి అలంకరణ సామగ్రిని అపహరించినట్లు పోలీసులు తెలిపారు. ఘటనపై శనివారం కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆంజనేయస్వామి ఆలయ పూజారి నవీన్‌కుమార్ 23వ తేదీన స్వామివారికి పూజా కార్యక్రమం ముగించుకొని కిరీటం, మీసాలు, వెండి కళ్లు బీరువాలో పెట్టి గర్భగుడికి, ముందు గేటుకు తాళం వేసి ఇంటికి వెళ్లారు. అదే రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు ఆలయ తాళాలు పగలగొట్టి స్వామివారి అలంకరణ వస్తువులు దోచుకెళ్లారు. దీంతో ఆలయంలో స్వీపర్‌గా పనిచేస్తున్న మహిళా గేటు తాళం విరగొట్టినట్లు పూజారి తెలిపారు. ఆలయంలో దొంగతనం జరగలేదని అనుకున్నారు. కానీ శనివారం అంజనేయస్వామి పూజ, అలంకారణ కోసం బీరువా చూడగా అక్కడ కూడా తాళాలు విరగొట్టి సుమారుగా 20తులాలు వరకు వెండి దొంగిలించినట్లు గుర్తించారు. పూజారి నవీన్‌కుమార్ ఫిర్యాదు మేరకు సంఘటన స్థలానికి పోలీసులు చేరుకొని వివరాలు సేకరించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ జగదీష్ తెలిపారు.

పోలీస్‌స్టేషన్‌కు ఇసుక ట్రాక్టర్లు

- యజమానులపై కేసు నమోదు

ఖిల్లాఘనపురం: అక్రమంగా ఇసుక తరలిస్తున్న ఐదు ఇసుక ట్రాక్టర్లను పట్టుకుని యజమానులపై కేసు నమోదు చేశామని ఏఎస్సై సత్యంగౌడ్ తెలిపారు. శనివారం ఉదయం ముసాపేట మండలంలోని మహ్మద్‌హుస్సేన్‌పల్లికి చెందిన కావలి విష్ణు, బోయ మైబు, రాగనమోని సంజీవ, అందె వెంకటేష్, కుర్వ చంద్రశేఖర్ గ్రామంలోని పెద్దవాగు నుంచి ఖిల్లాఘనపురం మండలం మానాజీపేట గ్రామానికి ట్రాక్టర్ల ద్వారా అక్రమంగా ఇసుక తరలిస్తుండగా పక్కా సమాచారంతో కాపుకాసి పట్టుకున్నట్లు తెలిపారు. ట్రాక్టర్లతో పాటు ఐదుమందిపై కేసులు నమోదు చేశామని ఏఎస్సై చెప్పారు. అనుమతి లేకుండా ఇసుక తరలిస్తే కచ్చితంగా కేసులు నమోదు చేస్తామని తెలిపారు.


ఖిల్లాఘనపురం పోలీస్‌స్టేషన్ లో ఇసుక ట్రాక్టర్లు

ఎండ వేడిమికి చేపలు మృతి


రంగాపూర్ శివారులో ఊరచెరువులో మృతి చెందిన చేపలు

పెబ్బేరు: మండలంలోని రంగాపూర్ ఊర చెరువులో చేపలు ఎండవేడిమితో ఆక్సిజన్ అందక మృత్యువాత పడుతున్నాయి. రెండు రోజులుగా సుమారుగా 10వేలకు పైగా చేపలు మృతి చెందడంతో పాటు మరికొన్ని నీటిపై తేలుతున్నాయి. దీంతో మత్స్యకారులు రెండేళ్ల నుంచి కష్టపడి పెంచి చేతికొచ్చే సమయంలో మృత్యువాతపడడంతో దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. అలాగే ప్రభుత్వం సబ్సిడీ ఇవ్వడంతో పాటు మత్స్యకారులు సొంత ఖర్చులతో 20వేల చేపపిల్లలు చెరువులో వదిలారు. మృతిచెందిన చేపలు విలువ సుమారుగా రూ.10 లక్షలపైగా ఉంటుందని, ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు.

బస్సులో బంగారం చోరీ

నవాబుపేట: ఆర్టీసీ బస్సులో మహిళ బ్యాగులో నుంచి ఐదున్నర తులాల బంగారు ఆభరణాలు చోరీకి గురైనట్లు బాధితురాలు శనివారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. కొౌకుంట్ల మండలం పేరూర్ చెందిన మామిడి జ్యోతి తన కుమారులతో కలిసి శుక్రవారం బాలానగర్ మండలం ఉడిత్యాల్‌కు బస్సులో బయలు దేరింది. ఆమె తన బంగారు ఆభరణాలు అన్ని బాక్సులో బ్యాగులో పెట్టుకుంది. ఆమె పేరూర్ నుంచి మహబుబ్‌నగర్‌కు వచ్చి అక్కడి నుంచి నవాబుపేటకు మరో బస్సులో చేరుకుంది. అనంతరం ఉడిత్యాల్ వెళ్లేందుకు షాద్‌నగర్ బస్సు ఎక్కింది. జంగమయ్యపల్లి గేట్ వద్ద చూసుకోగా అప్పటికే బ్యాగును కత్తిరించి ఆభరణాలు ఎత్తుకెళ్లినట్లు గుర్తించింది. ఒక రోజు మొత్తం వెతికాక, శనివారం నవాబుపేట పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ పురుషోత్తం తెలిపారు.

విద్యుదాఘాతంతో ఇల్లు దగ్ధం

బిజినేపల్లి: తిమ్మాజీపేట మండలంలోని ఎదిరేపల్లిలో గంగుల ఇందిరమ్మ ఇల్లు విద్యుదాఘాతంతో ప్రమాదశావత్తు దగ్ధం అయ్యింది. ఈ దుర్ఘటన శనివారం తెల్లవారుజామున చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ఇందిరమ్మ కుటుంబ సభ్యులు శుక్రవారం జడ్చర్ల పట్టణంలో ఒక శుభకార్యానికి వెళ్లారు. ఆరోజు సాయంత్రానికి ఆమె కుమారుడు ఇంటికి చేరుకుని పడుకున్నాడు. తెల్లవారుజామున ఇంటిలోపల పొగలు రావడం గమనించి త్వరగా బయటికి వచ్చాడు. వెంటనే స్థానికుల సహాయంతో మంటలు అదుపు చేశారు. ఈ విషయం తెలుసుకున్న రెవెన్యూ అధికారులు ఇంటిని పరిశీలించి నష్టాన్ని అంచనా వేశారు. దాదాపు రూ.5 లక్షల వరకు ఆస్తినష్టం జరిగిందని ఇందిరమ్మ అధికారులకు తెలిపింది. ఎంపీపీ రవింద్రనాథ్‌రెడ్డి బాధితుల ఇంటిని పరిశీలించి వారికి అండగా ఉంటామని హామీ ఇచ్చారు.

జూరాలకు స్వల్పంగా పెరిగిన వరద

ధరూరు: ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టుకు ఎగువ నుంచి వస్తున్న వరద స్వల్పంగా పెరిగినట్లు పీజేపీ అధికారులు తెలిపారు. శనివారం 1,926 క్యూసెక్కుల నీరు వచ్చి చేరిందన్నారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 9.657 టీఎంసీలు కాగా.. ప్రస్తుతం 7.798 టీఎంసీల నీటి నిల్వ ఉన్నట్లు వివరించారు. ప్రాజెక్టు నుంచి 155 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నట్లు తెలిపారు.

శ్రీశైలంలో 809.8 అడుగుల నీటిమట్టం..

దోమలపెంట (అచ్చంపేట): శ్రీశైలం జలాశయంలో శనివారం 809.8 అడుగుల నీటిమట్టం, 34.1960 టీఎంసీల నీటి నిల్వఉందని అధికారులు వివరించారు. 24 గంటల వ్యవధిలో రేగుమాన్‌గడ్డ నుంచి ఎంజీకేఎల్ఐకు నీటి విడుదల జరగలేదు. ఎండ తీవ్రతతో జలాశయంలో 224 క్యూసెక్కుల నీరు ఆవిరైంది.

తాగునీటికి 20 క్యూసెక్కుల వినియోగం..

మదనాపురం: మండలంలోని రామన్‌పాడు జలాశయంలో శనివారం పూర్తిస్థాయి నీటిమట్టం 1,019 అడుగులు ఉందని ఏఈ సింగిరెడ్డి రనీల్‌రెడ్డి తెలిపారు. జూరాల ఎడమ, సమాంతర కాల్వ నుంచి నీటి రాక నిలిచిపోగా.. రామన్‌పాడు నుంచి ఎన్టీఆర్ కాల్వకు నీటి సరఫరా నిలిపివేశారు. తాగునీటి అవసరాలకు 20 క్యూసెక్కుల నీటిని వినియోగిస్తున్నామని ఏఈ వివరించారు.